12082024-DIS-04_Layout 1 8/12/2024 3:53 AM Page 1




# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# మహాకవి పోతన మరో కోణం

**జిలుగు వెలుగుల తెలుగు సాహిత్య ప్రపంచాన పండిత పామర జనరంజకంగా శ్రీమదాంధ్ర మహా భాగవతంను రచించిన ప్రజాకవి, భక్త కవి, సహజ పండితుడు బమ్మెర పోతనామాత్యుడు. వారు 'శ్రీకైవల్య పథంబు చేరుటకునై చింతించెదన్' అంటూ శ్రీమదాంధ్ర మహా భాగవత గ్రంథాన్ని ఆరంభించారు.**

ఒకప్పుడు పోతన పద్యం ఒకటన్నా రాని తెలుగువారు ఉండేవారు కాదనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. పోతన పద్యం ఒకసారి అలా వింటే చాలు.. ఇలా వచ్చేస్తుంది. అల వైకుంఠపురిలో అంటూ అలా అలా పోతన పద్య లోకాలలోకి వెళ్లి పోవచ్చని కొందరంటారు. పామరులు సైతం పోతన 'నల్లనివాడు పద్మ నయనంబులవాడు... సిరికింజెప్పడు.. ఇందు గలడందు లేడని సందేహము వలదు.. కారే రాజులు రాజ్యముల్ గల్గవే..' అంటూ పాడుకునేవారు.



నాడు బడుల్లోనే కాదు గుడుల్లోనూ ఏదో ఒక పోతన గారి భాగవత పద్యం విన పడేది. ఇక హరికథల్లో, బుర్రకథల్లో, ఒగ్గు కథల్లో పోతన పద్యం కళకళలాడుతుండేది.

ఈ కాలంలో పాఠశాలల్లో, కాలేజీల్లో చదువుకు నేవారు సైతం పోతనగారి పద్యాలు కనీసం ఒక్క టన్నా చెప్పలేకపోతున్నారు. పద్యాలను పరీక్షలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. దీనికి కారణం ఏమిటంటే పురాణ కథలు తెలుసుకోవడానికి పద్యాలు ఎందుకండి? మామూలు భాషలోనే తెలుసుకోవచ్చు గదా? అని నేటి తరం విద్యార్థులు అధిక శాతం మంది అంటారు.

'పద్యం తెలుగువారి ఆస్తి. పద్యం పాడుకోవడానికి బాగుంటుంది' వంటి మాటలు సాహిత్య సభలలో చెప్పుకోవడానికి బాగానే ఉంటాయి కొందరు ఆధునికులు 'ఆ.. పద్యాలు ఎవరికి అర్థమవుతాయండి. నేటి సైన్స్ అండ్ మ్యాథ్స్ అర్థం చేసుకోవడానికే పిల్లలకు సమయం సరిపోవడం లేదు అంటారు.

ఇలాంటి నేపథ్యంలో పద్యం చదవడం, అది రాయడానికి ఛందస్సును నేర్చుకోవడం ఇదంతా అవసరమా? అని కొంత మందికి అనిపిస్తుంది. ఇదిలా ఉంటే పద్యాల్లో కంద పద్యానికి చాలా నియమాలు ఉంటాయి. వాటితో కందపద్యం రాసినవాడే నిజమైన కవి అని పద్యకవులు అంటారు.

> మహాకవి పోతన అనగానే సాహిత్య ప్రియులకు సర్వ లఘు కందపద్యం గుర్తుకువస్తుంది. అది..
> **అడిగెదనని కడు వడి జను**
> **నడిగిన దను మగుడ నుడువనని నడయుడుగన్**
> **వడి వడి జిడిముడి తడబడ**
> **నడుగిడునడుగిడదు జడిమ నడుగిడునెడలన్**

శబ్దాలంకార సొబగులతో సాగే ఈ పద్యం తెలుగు సాహితీవన మకరందం. పద్యాభిమానుల హృదయాలను పరవశింపజేసే అమృతసాగరోద్భవ లక్ష్మీ చిరు దరహాస కుసుమం.

> **అయితే ఈ పద్య మూలాల్లోకి వెళ్తే పోతనగారి గణిత పాండిత్యం ఎంత ఉన్నతమైనదో తెలుస్తుంది. ఆ ఉన్నత గణితాన్ని చక్కగా చెప్పగలిగితే నేటి విద్యార్థులు సైతం ఆకర్షితులవుతారు. పద్యం వైపునకు కదులుతారు.**

కంద పద్యంలో చతుర్మాత్రా గణాలను వాడతారు. అవి నల, గగ, భ,జ,సలు. పోతనగారు పై పద్యంలో 2, 4 పాదాల చివర సగణం వాడి మిగతా గణాలన్నిటిని నలములను వాడారు. కంద పద్యానికి సంబంధించిన ప్రాస యతులను పాటించారు. బేసి గణ ధర్మాలను 6వ గణ ధర్మాన్ని పాటించారు.

కంద పద్యంను రెండు భాగాలుగా విభజిస్తే మొదటి భాగంలో మూడు గణాలతో ఒక పాదం, ఐదు గణాలతో ఒక పాదం ఉంటుంది. ఇలా ఒక్కొక్క భాగం 8 గణాలతో కంద పద్యంలో రెండు భాగాలు ఉంటాయి.

పోతన రాసిన సర్వలఘు కందంలో మొదటి పాదం.. 3 గణాలు నలములే. రెండవ పాదం అయిదు గణములలో 4 నలములు 1 సగణం 4+1 అలాగే మూడు నాలుగు పాదములు 3 4+1 ఆధునిక గణితాన మాత్రికా పద్ధతిన దీన్ని కిందివిధంగా రాయవచ్చు. (3 (4+1)) (3 (4+1)) మాత్రికల్లో ఈ సంఖ్యలను మూలకాలని అంటారు. ఇక్కడ 1,3 మూలకాలు ఒక రీతిలోనూ 2, 4 మూలకాలు ఒక రీతిలోనూ ఉన్నాయి.

కంద పద్యంను ఇలా కాకుండా కంద పద్య నియమాలకు అనుకూలంగా, నల, గగ, భ,జ,స అనే గణాలన్నింటిని వాడుతూ కంద పద్యం రాస్తే ఇలాంటి మాత్రికా గణితంలో కంద పద్యం ఇమడదు. అలా ఇమిడేటట్లు పోతనగారు సర్వలఘు కంద పద్యం రాశారు. ఇలా ఈ పద్య మాత్రికల సంకలన వ్యవకలన గుణ భాగహారాలు తదితర గణ మూలాలనుంచే మన మహర్షులు, కవన మూలాలెరిగిన మహానుభావులు బీజాక్షరాలను, తదితర గణాక్షరాలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా కవన ప్రపంచంలో మహాకవి కాళిదాసు కవిత్వంలోనూ, మహాకవి పోతన కవిత్వంలోనూ ఇంకా ఇలాంటి కొందరి మహానుభావుల కవిత్వంలోనూ కొన్ని బీజాక్షరాలు ఉన్నాయని కొందరు సాహితీ ఉపాసకులంటారు.

వేదవేదాంగ పురాణేతిహాస ప్రబంధాదుల లోని మంత్ర బీజాక్షరాలు మాయలు కాదు. మర్మాలు కాదు అనేకానేక గణిత గుణ మూలాలు. ప్రకృతి, భాషా గణన ప్రసాదించిన గణిత మేధో విన్యాసాలు. మన పూర్వికులు గణిత సంబంధ విషయాలను సైన్స్ సంబంధ విషయాలను దైవాంశ తేజాలుగా భావించారు. అలా భావించడంలో తప్పు లేదు. ఎందుకంటే అవి దైవంలా శాశ్వతాలు. నిరంతరం పదుగురికి ఉపయోగపడే పరోపకార విజ్ఞాన గుళికలు.

ఆ గణిత మూలాలను తెలుసుకోవాలంటే వేద ఛందో మూలాల్లోకి వెళ్లాలి. అదీ ఆధ్యాత్మిక పథంలో, మానసిక వికాస కళాపథంలో కాక సశాస్త్రీయ పథంలో వెళ్లాలి. ఇక ఆధునిక గణిత శాస్త్రవేత్తలు మరో మార్గం ద్వారా ఇక్కడికే వస్తున్నారు. తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. ఇక్కడి గణితం కూడా చిన్న చిన్న మార్పులతో ఆధునిక గణిత ఛాయలతోనే ప్రకాశిస్తుంది.

> **మహాకవి పోతనగారు తమ భాగవతంలో కేవలం పురాణ కథలను చెప్పడానికే ప్రయత్నించలేదు. ఆయా పద్య లక్షణాల మూలల గణ చక్రాల నెరిగి పద్య ప్రయోగం చేశారు. గణంలోని గణిత చక్రాల స్వరూపాన్ని కొంత ఔపోసన పట్టారు. అంత మహోన్నత పద్య రచన చేశారు. ఆ గణ చక్రాలలోని గణిత చక్రాలను బహిర్గతం చేయగలిగే పోతనగారి గణిత సామర్యం సామాన్యం కాదనిపిస్తుంది.**

ఇక ఆధ్యాత్మికంగా చెప్పాలంటే, 'అడిగెదనని కడు వడి జను...' అను సర్వ లఘు కంద పద్య భాగంలో మొత్తం 8 గణాలుంటాయి. ఇలా పద్యంలో రెండు భాగాలుంటాయి. ఈ పద్యం లక్ష్మీదేవికి సంబంధించినది. ఇక్కడ 8 గణాలలో 8 మంది లక్ష్మీదేవులు అనగా అష్ట లక్ష్ములున్నారు. 8వ గణం చతుర్మాత్రా గణమైనప్పటికీ అది మూడక్షరాల గణం. దీని మాటు మహా పరమార్థం ఉంది అని ఇలా ఆధ్యాత్మికంగా ఎంతైనా చెప్పవచ్చును. ఇది ఆధ్యాత్మికవేత్తలను, సుకవులను, పద్యకవులను ఆనందింపజేస్తుంది కానీ విద్యా ప్రపంచానికి ఉపయోగపడదు. ఇలా పోతనగారి శ్రీమదాంధ్ర మహా భాగవతము లోతులకి వెళ్లిన కొద్దీ మహదానందం కలుగుతుంది. మహాకవి పోతనగారి మీద అభిమానం పెరుగుతుంది.

అయితే మహాకవి పోతనగారి గణిత గుణాలను తెలుసుకుంటే బ్రహ్మానందం కలుగుతుంది. ఇలాంటి మహాకవి పోతనను నేటి ప్రపంచానికి తెలియచేయగలిగితే ఆధునిక విద్యా ప్రపంచం సైతం పోతనను కళ్లకద్దుకోవడమే కాదు, వారిని తమ మెదడుకు అద్దుకుంటుంది.



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు
98494 48947



## వాన పర్వం

మేఘాలు వలలు విసిరాయా
చినుకులు గాలాలు వేసాయా
మనిషి
చేపపిల్లలా చిక్కుకుపోయాడు!

వాగులు స్థానబలం చూపాయా
చెరువులు నిండుకుండలయ్యాయా
మనిషి
కాగితం పడవలా కొట్టుకుపోయాడు!

ఉరుములు గర్జించాయా
మెరుపులు తళుక్కుమన్నాయా
మనిషి
గుండె చేత పట్టుకుపోయాడు!

మానవ భారతంలో
ఎన్నెన్నో ప్రకృతి పర్వాలు,
జీవితకాలంలో
ఎన్నెన్నో వికృతి దృశ్యాలు!

వానొచ్చినా
వడగాల్పొచ్చినా,
మనిషి మాత్రం
ఋషిలా నిలవడటం నేర్చుకోవాలి!




పుట్టి గిరిధర్
94949 62080

**"ఎన్నో రాత్రులు మేలుకుంటే తప్ప ఈ దళితోద్యమ అఖండ చరిత్ర బయటికి రాదు. ఒక చరిత్రను బయటికి తేవడం తేలికైన పని కాదు. కొలిమిలో కాలిన కర్రుకు తెలుసు బాధేంటో.. పొలాన్ని పొతం చేసి పంటను నిలబెట్టిన నాగలికి తెలుసు కష్టం ఎంతనో.. అలాగే ఈ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' వెనుక ఉన్న కృషి ఎంతటిదో సంగిశెట్టి శ్రీనివాస్‌కే తెలుసు.**

# దళిత వికాస సింగిడి



మన మైదానం ఖాళీగా లేదు, మనం రాయకపోవడమే ఖాళీ.. ఇక్కడ అస్తిత్వం కోసం పోరాడని వీరులు వీరవనితలు, గెలువని క్రీడాకారులు లేరు. కాకపోతే, చరిత్ర రాయలేదంతే. అక్కడక్కడా రాసినా వెలుగులోకి రానీయలేదు. బండారు అచ్చమాంబ కథలు, సురవరం కవిత్వం, సురమౌళి కథలు, సుషుప్తి మాదిరెడ్డి నవల, ఇందుమతి కవిత్వం, తెలంగాణ విస్మృత వీరుడు కేవల్ కిషన్... తెలంగాణ చారిత్రక పత్రాలు.. ఇలా ఎన్నింటినో పరిశోధించాడు. ఎన్నో గ్రంథాలను వెలుగులోకి తెచ్చారుసంగిశెట్టి శ్రీనివాస్. కాలాన్ని బోనులో నిలబెట్టిన సంగిశెట్టి చారిత్రక సమగ్ర పరిశోధన చేశారు. ఆ పుస్తకమే 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'.




ప్రతి ఇంటా ఉండాల్సిన పుస్తకం 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'. ఈ పుస్తకాన్ని మునివేళ్లతో పట్టుకొని చూడండి మన తాతలు, మన ముత్తాతలెందరో చరిత్ర మరుగున మట్టిలో కప్పేయబడ్డారనే విషయం అవగతమవుతుంది. ఏ మనువాదులు వాళ్లను అణగదొక్కారు? ఏ ఆధిపత్యవాదులు వాళ్లను హత్యచేశారు? వాళ్లు వీరులుగా కాకుండా కులవాదులుగా, అంటరానివారుగా ఎలా ముద్రవేయబడ్డారు, వెలివేయబడ్డారు? అలా అగ్రకుల సమాజం వెలేసిన విస్మృతుల చరిత్రనే విజయ గీతికగా, వీరచరిత్రగా 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' పుస్తకం మనకు కనిపిస్తుంది.

మనకు తెలియకుండానే మన మీద పసరు రుద్దినటువంటి ఒక నిచ్చెనమెట్ల కులవ్యవస్థ భావజాలానికి మనం బానిసలుగా ఉన్నాం. అదీ స్వతంత్రంగా, బలవంతంగా. రెండూ మన ముందున్నవి. మన చరిత్ర గురించి మనం తెలుసుకోవడమే మనందరి కర్తవ్యం.

> **మన పూర్వికులే ఈ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'లో హీరోలు. నేలమాళిగలలో ఇంకిపోయిన దళిత సామాజిక సాంస్కృతికతను నిలబెట్టేందుకు చేసిన ప్రయత్నమే 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర'. మూలాలను లోతుగా పరిశోధిస్తూ, విశ్లేషిస్తూ ఇప్పటికే ఎందరో చరిత్రలో సామాజిక వీరవనితల వీరులపై కప్పబడిన బూజును దులిపారు సంగిశెట్టి. కట్టివేయబడిన ప్రాచీన తాళకట్టలను విప్పారు. బందీకాబడ్డ చరిత్రకెక్కదగ్గ వారందరినీ చరిత్ర శిఖరాగ్రాన నిలబెట్టేందుకు సంగిశెట్టి కృషిచేశారు.**

తెలంగాణ అస్తిత్వానికి పట్టం గట్టిన ఈ 'తెలంగాణ దళితోద్యమ చరిత్ర' విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 'అన్నీ మేమే కనిపెట్టాం అన్నింటికీ మేమే ముగ్గు పోశాం' అని చెప్పుకొనే వాళ్లందరూ ఈ పుస్తకాన్ని పరిపూర్ణంగా చదువాలి.

ఈ పుస్తకంలో ప్రధానంగా ఆధునిక కాలం నుంచి తెలంగాణ సమాజంలో దళిత సమాజం ఎదిగి వచ్చిన తీరు చెప్పడమైంది. దళితులు క్రీడలు, జర్నలిజం, విద్య, వ్యాపారరంగాల్లో ఎదిగొచ్చిన తీరు, అందుకు వారు ఎదుర్కొన్న అవరోధాలు, వాటిని అధిగమించడంలో చూపిన ఓర్పు కూడా పూసగుచ్చినట్టు చర్చించారు సంగిశెట్టి.

హైదరాబాద్ నుంచి వలసపోయి విఖ్యాతులుగా వివిధ రంగాల్లో తెలంగాణ కేతనాన్ని దేశ విదేశాల్లో ఎగరేసిన న్యాయమూర్తి, పార్లమెంటేరియన్ రాజారామ్ భోలే గురించి, హెచ్.కె.ఆరా, కుమారిల స్వామి లాంటి అంతర్జాతీయ పెయింటర్ల గురించి, బొంబాయి చిత్రసీమలో సంగీతంలో తనదంటూ ముద్రవేసిన శంకర్ జీ గురించి ఇందులో రాశారు. యక్షగానాన్ని చిరస్మరణీయం చేసిన చిందు ఎల్లమ్మ గురించి కూడా ఈ పుస్తకంలో ఉండటం ముదావహం. చరిత్రకు అధిక ప్రాధాన్యం ఇస్తూనే స్ఫూర్తి ప్రదాతల గురించి రాయడం గొప్ప స్ఫూర్తిగా ఉన్నది.

హైదరాబాద్ రాజ్య దళిత సమాజంపై అంబేద్కర్ ప్రభావం, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా దళితులు ఎదిగి వచ్చిన తీరు, నిజాం ప్రభుత్వంలో దళిత ప్రాతినిధ్యం, బ్రిటిష్ వారి చేయూతను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. తెలంగాణ దళిత చైతన్యాన్ని, చరిత్రను రాసిపోసిన కల్లం ఈ పుస్తకం. సమస్త వికాస చరిత్రనంత రాసులుగా పోసి, చదువుకోవడానికి వీలుగా ఉన్న అత్యుత్తమ సమగ్ర గ్రంథమే ఈ తెలంగాణ దళితోద్యమ చరిత్ర.



వనపట్ల సుబ్బయ్య
94927 65358



## విరిగిపోయిన పడవ

ఏ ప్రేమికుల గుర్తో,
ఎక్కడి ప్రయాణికుల కలనో,
విరిగిపోయిన పడవ
సముద్రం ఒడ్డున పడి ఉన్నది

అతడు నేను కవిని అని చెప్పుకోలేదు
బ్యాండేజీ మీద నెత్తురు కనిపించినట్టు,
అందరు అతని కళ్ళల్లో కవిత్వం చూశారు

యుద్ధాలు జరిగిన తర్వాత
అతడు కవిత్వం మానేసి,
మనుషులను ప్రేమించడం ముఖ్యమన్నాడు.

అతడు పుస్తకాలు ప్రచురించాడో
లేదో తెలియదు కానీ,
ఎవరూ పట్టించుకోని విరిగిన పడవను,
బాగుచేయడం మొదలుపెట్టాడు

ఖైదీలందరూ వాళ్ల వయసు మరిచిపోయి,
చాలా ఏండ్లు గడిచాయి.
వాళ్లు, జైలు గోడలు కూలడం కోసం,
చిన్నపిల్లల్లా, ఇప్పటికీ
కలలు గంటూ నిరీక్షిస్తున్నారు

ఎప్పుడో సూర్యుడు కిటికీ మీద,
పక్షులతో కలిసిపోతాడు
అతడు కవిత్వం రాస్తానని,
ఎప్పుడూ అనలేదు

చీకట్లో, తుఫానుకు ఎదురుగా వెళ్లి,
దీపాలు పెట్టడానికి
కొట్టుకుపోతుంటే తెలిసింది,
వెలుతురే అతడు రాసే కవిత్వమని!
ప్రయత్నమే దాని సౌందర్యమని!!



ఆశారాజు
93923 02245

**సరిగ్గా 60 ఏండ్ల కిందట ఉమ్మడి ఏపీలోని పాఠ్య పుస్తకాల్లో పైడిమర్రి వేంకట సుబ్బారావు రాసిన 'భారతదేశం నా మాతృభూమి' ప్రతిజ్ఞను ముద్రించారు. కానీ, రచయిత పేరును మాత్రం ముద్రించలేదు. రచయిత పేరు లేకుండానే 50 ఏండ్ల పాటు ప్రతిజ్ఞను పాఠశాలల్లో విద్యార్థులు ఆలపించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాతే పైడిమర్రి వేంకట సుబ్బారావు వంటి మహనీయులకు గుర్తింపు లభించింది.**

# మానవతావాది పైడిమర్రి




కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడ్డ అప్పటి తెలంగాణ ప్రభుత్వం పైడిమర్రి వేంకట సుబ్బారావు పేరును తెలంగాణ పాఠ్య పుస్తకాల్లో ప్రతిజ్ఞ ఎగువన చేర్చి ఆయనకు సముచిత ప్రాధాన్యాన్ని కల్పించింది. అంతేకాకుండా 5వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో ఆయన జీవిత వివరాలను పొందుపరచడమే కాకుండా, 2016లో పైడిమర్రి శతజయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించింది.

పైడిమర్రి గొప్ప దేశభక్తుడు. మంచి రచయిత. నీతి, నిజాయితీ గల ప్రభుత్వ ఉద్యోగి. గొప్ప వైద్యుడు. మానవతావాది. 1916, జూన్ 10న నల్గొండ జిల్లాలోని అన్నేపర్తి గ్రామంలో పైడిమర్రి జన్మించారు. 1962లో విశాఖపట్నంలో జిల్లా ఖజానాధికారిగా పనిచేస్తున్నప్పుడు ఆయన ప్రతిజ్ఞ రాశారు. 1965 నుంచి దేశవ్యాప్తంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞగా ఆలపించబడుతున్నది. దేశానికి జాతీయ ప్రతిజ్ఞను అందించిన పైడిమర్రికి ఎటువంటి పురస్కారాలు దక్కలేదు. తెలంగాణ ప్రభుత్వ స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం కూడా 6వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఆయన జీవిత వివరాలని పొందుపర్చింది. పైడిమర్రి జీవిత చరిత్రను తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో వీజీఎస్ ప్రచురణ సంస్థ ముద్రించి పుస్తక రూపంలోకి తెచ్చింది. పైడిమర్రి పేరుతో హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌పై నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. అదేవిధంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పాఠ్యపుస్తకాల్లో పైడిమర్రి పేరును చేర్చవలసి ఉన్నది.

**(ఆగస్టు 13న పైడిమర్రి వర్ధంతి)**



యం.రాంప్రదీప్
94927 12836




## చౌరస్తా!

నలుదిక్కుల నుంచి నలుగురొస్తే
ఒక గుంపు తోడైతది
తోడైన నాలుగు
ఆలోచనలకు తొవ్వైతది

ఇది చౌరస్తా!
ఎక్కడ మొదలైందో
బాల్యం మొదలైనట్టు...

బుడిబుడి అడుగులు ఏసి ఏసి
ఇప్పుడు ఇక్కడ నిటారుగా
నిలబడ్డాయి కాళ్ళు

ఎన్ని కుటుంబాల నిలయమిది
ఎన్ని స్నేహాల కలయిక

తీసివేత ఎరుగదు
అంతా కూడికనే...

నలుగురు మాట్లాడిన
మాటలు మూటలే
వెయ్యి ఏనుగుల బలమైతది
నాలుగు చేతులే
బోలెడన్ని చప్పట్లు!
నలుగురి ఆలోచనతోనే.
నాణ్యమైన ధర నిర్ణయమైతది!

ఇక్కడ అన్నీ అమ్ముకోవచ్చు
అన్నీ కొనుక్కోవచ్చు

నడుస్తూ నడుస్తూ చౌరస్తా
దొరికిందనుకో
అప్పుడు నీ రస్తా నీకు దొరుకుతది!

ఒంటరిగా ఉన్నవాడికి
జంట దొరుకుతది

అది బతుకైతది!
ఎవరిదైనా ఆ బతుకు బాగైతది!



కందుకూరి శ్రీరాములు
94401 19245

## ఆవిష్కరణ..

**దళిత** సాహిత్య దళ నాయకుడు మద్దూరి నగేష్ బాబు జయంతి సందర్భంగా.. 2024, ఆగస్టు 15 గురువారం రోజున సాయంత్రం 5 గంటలకు ప్రకాశం జిల్లా ఒంగోలులోని 1వ పట్టణ పోలీసుస్టేషన్ దగ్గరలోని సీపీఐ ఆఫీసులో 'మద్దూరి నగేష్‌బాబు సమగ్ర కవిత్వం' పుస్తకావిష్కరణ సభ జరుగనున్నది. సభాధ్యక్షులుగా ఆత్మకూరి బాల చెన్నయ్య, ముఖ్య అతిథిగా ఆచార్య ఎం.ఎం.వినోదిని హాజరుకానున్నారు. వక్తలుగా డాక్టర్ ఖాజా, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, నూకతోటి బాబురావు, గంగవరపు సునీత, డాక్టర్ నూకతోటి రవికుమార్, ఎజ్రాశాస్త్రి, సజ్జా వేంకటేశ్వర్లు, కత్తి కళ్యాణ్, శ్రీరామకవచం సాగర్, నబీ కె ఖాన్, డాక్టర్ బద్దిపూడి జయరావు, ఎన్.మోహన్‌కుమార్ ధర్మ, పల్నాటి శ్రీరాములు హాజరుకానున్నారు.

**- నిర్వహణ: బహుజన కెరటాలు**

## నవల..

2024, ఆగస్టు 17 శనివారం రోజున ఉదయం 10 గంలకు తిరుపతిలోని 'ఛాంబరాఫ్ కామర్స్'లో కేవీ మేఘనాథ్‌రెడ్డి రాసిన 'పాయిదరువులు' నవల ఆవిష్కరణ జరుగనున్నది. ఈ కార్యక్రమంలో మధురాంతకం నరేంద్ర, పలమనేరు బాలాజీ, ఆర్‌సీకే రాజు, సీఎన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొననున్నారు. అందరికీ ఆహ్వానం.

**- కేవీ మేఘనాథ్‌రెడ్డి**

## పుస్తకం..

2024 ఆగస్టు 18 ఆదివారం రోజున సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కవి, అనువాదకుడు, సినీ విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ రాసిన 'యాదోంకి బారాత్' పుస్తకం ఆవిష్కరణ కానున్నది. ఈ పుస్తకాన్ని రచయిత తండ్రి వారాల అంజయ్య ఆవిష్కరించనుండగా, చిరంజీవి ప్రద్యుమ్న తొలి ప్రతిని అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, ఆత్మీయులు, స్నేహితులు, కుటుంబసభ్యులు హాజరుకానున్నారు.

**- ఇందిరారాణి,**
ప్రోజ్ పోయెట్రీ ఫోరం నిర్వాహకురాలు